ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసిన ఏటీడీవో

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

పాఠశాలలో వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఏటీడీవో సత్యవతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : పట్టణంలోని పత్తిపాక రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల, ముత్యాలమ్మగూడెంలో ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఏటీడీవో సత్యవతి తనిఖీ చేశారు. 'నమస్తే తెలంగాణ'లో 'ఆశ్రమ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తం.. విద్యార్థులతో మరుగుదొడ్లు క్లీన్' అనే కథనం మంగళవారం ప్రచురితమైంది. దీంతో వెంటనే స్పందించిన ఏటీడీవో ఆయా పాఠశాలలను తనిఖీ చేసి వసతులు, పరిసరాల పరిశుభ్రత, పరీక్షల టైమ్‌టేబుల్, భోజన మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుకున్నారు. విద్యార్థులు బయట పరిసరాలకు, తరుచూ గ్రౌండ్‌లోకి రాకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

వైభవంగా వెంకన్న స్వామి కల్యాణం

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నర్సింహులపేట, మార్చి 26: మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రిపై వెలిసిన పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి పౌర్ణమి వెలుగుల్లో వైభవంగా జరిగింది. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవతామూర్తుల విగ్రహాలను గుట్ట పైనుంచి తీసుకువచ్చారు. డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రునాయక్ పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించారు. వేంకటేశ్వరస్వామి, పద్మావతి ఎదుర్కోలు ఆటపాటలతో చేశారు. అనంతరం కల్యాణాన్ని అర్చకులు శ్రీరామాచార్యులు, నందరాచార్యులు, కేశవాచార్యులు, శ్రీనాథాచార్యులు నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు అందజేశారు. భక్తులకు తాగునీరు, వైద్య సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మంగళవారం రాత్రి రథోత్సవంలో గ్రామ పురవీధుల్లో స్వామివారు భక్తులకు దర్శమిచ్చారు. ఈవో వేణుగోపాల్, దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ శేఖర్ ఉన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయం ముందు ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆలయ విరాళాలపై గ్రామస్తుల ఆందోళన

కేసముద్రం, మార్చి 26: మండలంలోని ఉప్పరపల్లిలో ఇటీవల నిర్మించిన శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ ఖర్చుల వివరాలు తెలుపాలని గ్రామస్తులు మంగళవారం ఆలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామంలో భక్తుల నుంచి విరాళాలు వసూలు చేసిగుడి నిర్మించారని, గుడి నిర్మించి మూడేళ్లు కావస్తున్నా ఖర్చుల వివరాలు గ్రామస్తులకు తెలియజేయలేదని ఆరోపించారు. ఆలయ కమిటీ సభ్యులు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు.

ఏప్రిల్ 2న పూర్తి ఆదాయ వ్యయాల గురించి వివరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. గ్రామస్తులు రమేశ్, మోహన్ రెడ్డి, పరిపూర్ణాచారి, చందు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పీడీగా అదనపు కలెక్టర్‌కు బాధ్యతలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీగా అదనపు బాధ్యతలను కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ మంగళవారం అప్పగించారు. గతంలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన పురుషోత్తం విధులపై నిర్లక్ష్యంగా ఉండటం వల్ల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆ స్థానంలో అదనపు కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు.

1,783 పోలింగ్ కేంద్రాలు

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 1,783 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మౌలిక వసతులను అధికారులు కల్పిస్తున్నారు. ఫ్యాన్లు, టాయిలెట్స్, నీడ కోసం టెంట్లు, కుర్చీలు ఏర్పాట్లు చేస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు ఇలా ఉన్నాయి. డోర్నకల్ 256, మహబూబాబాద్ 283, నర్సంపేట 283, ములుగు 303, పినపాక 241, ఇల్లందు 241, భద్రాచలం 176 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల్లో వినియోగించనున్నారు.

మానుకోట పార్లమెంట్‌లో యువ ఓటర్లే కీలకం

మొత్తం ఓటర్లు 15,26,998 మంది

- **50 ఏళ్ల లోపువారు 10,76,267**
- **అభ్యర్థి గెలుపును నిర్ణయించేది వీరే..**

మహబూబాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో యువత ఓట్లు కీలకం కానున్నాయి. 18 నుంచి 50ఏళ్ల లోపు ఓటర్లు అభ్యర్థి గెలుపు, ఓటములను నిర్ణయించనున్నారు. మహబూబాబాద్‌పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,26,998 ఓటర్లు ఉన్నారు. ఇందులో 50ఏళ్ల లోపువారు 10,76,267 మంది ఉండగా, వీరే గెలుపు డిసైడ్ చేయనున్నారు. 18 నుంచి 19 ఏళ్లలోపు 44,888 మంది, 20 నుంచి 29 ఏళ్లలోపు 3,25,093 మంది, 30 నుంచి 39 ఏళ్లలోపు 3,96,868, 40నుంచి 49 ఏళ్లలోపు 3,09,418 మంది ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 ఏళ్ల లోపు ఉన్న వారే కీలకం కానున్నారు. అదేవిధంగా 50నుంచి 59ఏళ్ల లోపు 2,21,925, 60 నుంచి 69 ఏళ్ల లోపు 1,37,597, 70 నుంచి 79ఏళ్ల లోపు 68,367 మంది, 80 నుంచి 89 ఏళ్లు 19,166, 90 నుంచి 99 ఏళ్ల లోపు 3,375, 100ఏళ్ల పైబడినవారు 301 మంది ఓటర్లు ఉన్నారు. మానుకోట పార్లమెంట్ పరిధిలో డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న విషయం తెలిసిందే.

మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల ఎంపికలు

విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

కొత్తగూడ, మార్చి 26: మండలంలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్పోర్ట్స్ విద్యార్థుల ఎంపికలు చేపట్టారు. ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ముంకిడి ఎర్రయ్య, మహబూబాబాద్ ఎస్‌వో మోహన్‌నాయక్, వరంగల్ ఎస్‌వో కిస్టర్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థుల ఎంపిక ప్రారంభించారు. ఈనెల 27, 28 తేదీలో రెండు రోజులు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు 50మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవదాసు, ఉపాధ్యాయులు వెంకన్న, నాగేశ్వర్ రావు , రమేశ్, వెంకట్, విజయలలిత, దేవేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతినిధుల ఎన్నిక

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతినిధులను ప్రకటిస్తున్న రాజేందర్‌రెడ్డి

తొర్రూరు, మార్చి 26: లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ప్రకటించారు. పూర్వ గవర్నర్, తొర్రూరు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా చిదిరాల నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా తమ్మి రమేశ్, కోశాధికారిగా బోనగిరి శంకర్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ రాంనర్సయ్య, నాళ్ల కృష్ణమూర్తి, పెరుమాండ్ల రమేశ్, సహాయ కార్యదర్శిగా ముడుపు రవీందర్‌రెడ్డి, సహ కోశాధికారిగా సోమ రాజశేఖర్‌ను నియమించినట్లు తెలిపారు.

దన్నసరిలో మిత్రుడికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

క్లాస్‌మేట్‌కు ఆర్థికసాయం

కేసముద్రం, మార్చి 26: మండలంలోని దన్నసరి గ్రామానికి చెందిన కొండ నాగయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, కేసముద్రం స్టేషన్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరం పదోతరగతి బ్యాచ్‌మేట్స్ మంగళవారం రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. స్నేహితులు నద్దునూరి అశోక్, స్టాలిన్, మిట్టగడుపుల మహేందర్, చిట్ల సంపత్, భూక్య వాల్య, కొడారి నాగేంద్రబాబు, బాలు,రమేశ్ పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురిపై కేసు

గార్ల, మార్చి 26 : వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదైంది. ఎస్సై జీనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రగిరికి చెందిన భూక్య రమేశ్ గతంలో ప్రేమించిన కేసు విషయంలో జైలుకు పోయి వచ్చాడు. అది మనసులో పెట్టుకున్న బాలిక తల్లిదండ్రులు గంగావత్ సునీత, మల్సూర్, మంగీలాల్ రోడ్డుపై అడ్డగించి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

రాష్ట్ర ప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : రాష్ట్రంలో కార్మికవర్గ పాలసీని వెంటనే ప్రకటించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జగన్నాథ భవనంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. శ్రామికుల జీవన ప్రమాణానికి గ్యారెంటీ కల్పించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సమస్యలపై కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రాజు, కుంట ఉపేందర్, రాజమౌళి, నాగన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : ఈనెల 28న పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ జర్నలిస్ట్ బందగీ షోయబుల్లాఖాన్ ప్రాంగణంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్ర, జిల్లా నాయకులు, సభ్యులు హాజరవుతారని, జర్నలిస్టులకు సన్మానాలు, యూనియన్ ఆధ్వర్యంలో మెమెంటోలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు గోపాలపురంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన

కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

గార్ల, మార్చి 26: మండలంలోని గోపాలపురంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మహిళలు స్థానిక ఆంజనేయస్వామిగుడిలో కుంకుమపూజ చేశారు. కాగా బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఘనంగా జరగనుంది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇల్లెందు శాసన సభ్యుడు కోరం కనకయ్య, కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ హాజరు కానున్నట్లు బొడ్రాయి కమిటీ సభ్యుడు దనియాకుల రామారావు తెలిపారు. మండలంలోని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేస్తున్న సమ్మయ్యగౌడ్

కేసముద్రం, మార్చి 26: మండలంలోని కేసముద్రం విలేజీకి చెందిన నిరుపేద రంగోజు రంగమ్మ కుటుంబానికి మంగళవారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. దామరకొండ ప్రవీణ్ కుమార్, కాటం రాంరెడ్డి, తోట వెంకన్న, ఎర్రంశెట్టి అశోక్, తుమిల్ల వెంకన్న పాల్గొన్నారు.

కుమ్మరుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

దంతాలపల్లి, మార్చి 26: కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుమ్మరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కుమ్మరి సంఘం జిల్లా యువజన నాయకుడు గణేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం తమ కులానికి కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఎస్సీలకు గ్రూప్స్‌లో ఉచిత శిక్షణ

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : జిల్లాలో ఎస్సీ నిరుద్యోగ యువతకు గ్రూప్స్‌లో ఉచిత శిక్షణ పొందేందుకు ఈనెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ తర్వాత అడ్మిషన్ స్లిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9440120620 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి శ్రీనివాసరావు

డోర్నకల్, మార్చి 26: మండలంలోని అమ్మపాలెం, గొల్లచర్ల, పకీర్‌తండా, చాప్లతండాలో పోలింగ్ కేంద్రాలను మంగళవారం నోడల్ అధికారి ఏఎంవో పుల్లారావు సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సెక్రటరీ సాయితేజ, అన్వర్, సునీల్ పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులుగా ముఖేశ్, శంకర్

పెద్దవంగర, మార్చి 26: మండలంలోని చిట్యాలకు చెందిన కొయ్యడి ముఖేశ్, ఎల్బీ తండాకు చెందిన జాటోత్ శంకర్‌ను బీజేపీ పెద్దవంగర మండలం ప్రధాన కార్యదర్శులుగా నియమించినట్లు మండల అధ్యక్షుడు ఉడత శ్యామ్ తెలిపారు. మండల సోషల్ మీడియా అధ్యక్షుడు కట్టోజు భాస్కరాచారి, బూత్ అధ్యక్షులు ఫణికర యాకయ్య, ఈదురు యాకన్న పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★HNK లగ్జరీ ఎంటర్ ప్రైజెస్ వెయ్యి స్తంభాల గుడి ప్రక్కన Air Coolor & ఫర్నిచర్ షాపులో పని చేయడానికి సెల్స్ గర్ల్స్, సెల్స్ బాయ్స్, సూపర్ వైజర్, హెల్పర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర:9347881523.
NTW-321500

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

ఎక్సైజ్ స్టేషన్ నుంచి మద్యం తరలింపు

- **విక్రయించేందుకేనని ప్రచారం**
- **ధ్వంసం చేశామంటున్న ఎక్సైజ్ ఎస్సై**

తొర్రూరు, మార్చి 26: తొర్రూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నుంచి మద్యం తరలింపు వ్యవహారం అనుమానాలను రేకెత్తిస్తోంది. సీజ్ చేసిన మద్యాన్ని ఎక్సైజ్ ఎస్సై రవళిరెడ్డి గుట్టుచప్పుడు కాకుండా మద్యం షాపులకు తరలించి విక్రయించే ప్రయత్నం చేశారని సామాజిక మధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్‌శాఖ తనిఖీల్లో బెల్ట్‌షాపుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను సోమవారం రాత్రి గుట్టుగా తొర్రూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నుంచి ఆటోలో ఓ మద్యం షాప్‌నకు పంపగా, షాపు యజమాని తీసుకునేందుకు నిరాకరించడంతో ఎక్కడికి తరలించారో తెలియకుండా పోయింది. తొర్రూరు ఎక్సైజ్ సర్కిల్ సీఐ భాస్కర్‌రావు వ్యక్తిగత కారణాలతో 15రోజులుగా దీర్ఘకాలిక సెలవుల్లో ఉండగా, ప్రస్తుతం ఇక్కడ ఎక్సైజ్ ఎస్సైగా రవళిరెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆటోలో మద్యాన్ని విక్రయించేందుకు తరలించారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఇద్దరు ఆటోలో మద్యం తరలిస్తుండగా షాపుల వద్దకు మద్యం బాక్స్‌లు తీసుకువెళ్లిన క్రమంలో వీడియో తీసినట్లు సమాచారం. ఎక్సైజ్ ఎస్సై రవళిరెడ్డిని వివరణ కోరగా ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన మద్యం పక్కదారి పట్టలేదని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. కొందరు అవగాహన లేక అడ్డగోలు ప్రచారం చేస్తున్నారని, గడువు దాటిన బీరు సీసాలను ఉన్నతాధికారుల ఆదేశాలతో ధ్వంసం చేసేందుకు తరలించామని చెప్పారు. బుధవారం వివరాలను ఎక్సైజ్‌శాఖ జిల్లా స్థాయి ఉన్నతాధికారులు వెల్లడిస్తారని పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : ఓ వ్యక్తిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. ఎస్సై దీపిక తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఓ బాలికను ఓ యువకుడు ఈవ్ టీజింగ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చూపింది. దీంతో ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : కేయూ వీసీ

హనుమకొండ, మార్చి 26 : రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి హాజరై రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం సామాజిక సేవా కార్యక్రమంగా భావించి తలసేమియా బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి, చందులాల్, శ్రీనివాస్, హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మహబూబాబాద్ రూరల్, మార్చి 26 : గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎంఆర్ లక్ష్యాలపై కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వేసవిలో ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 125, ఐకేపీ ఆధ్వర్యంలో 49 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్, గన్నీ బ్యాగులు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, డీఎస్‌వో ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల పండుగ

- **సాగరంలో పోచమ్మ, దుర్గామాత వేడుకలు**
- **చిల్పూరులో రేణుకాఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన**

చిల్పూరులో ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న భక్తులు

జఫర్‌గఢ్ : పోచమ్మ తల్లి విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న సాగరం గ్రామస్తులు

జఫర్‌గఢ్/చిల్పూరు, మార్చి 26 : జఫర్‌గఢ్, చిల్పూరు మండలాల్లో గ్రామ దేవతల పండుగలు ఘనంగా జరిగాయి. జఫర్‌గఢ్ మండలం సాగరంలో గ్రామ దేవతలకు మంగళవారం పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోచమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హోమాలు నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించారు. అనంతరం ఆడబిడ్డలు అమ్మవార్ల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఉత్సవమూర్తులను గ్రామంలోని వీధుల్లో డప్పుచప్పుళ్లతో ట్రాక్టర్‌పై ఊరేగించారు. పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనతోపాటు అమ్మవార్లకు బోనాలు సమర్పించే వేడుకలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు విలేకరులకు తెలిపారు. మరోవైపు అమ్మవార్ల వేడుకలను పురస్కరించుకుని బంధుమిత్రుల రాకతో సాగరంలో పండుగ వాతావరణం నెలకొంది.

చిల్పూరులో పుట్టల ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

చిల్పూరు మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం పుట్టల ఎల్లమ్మ విగ్రహాన్ని గౌడ కులస్తులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మోడం విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రేణుకాఎల్లమ్మ తల్లికి బోనాలను సమర్పించామన్నారు. ఆలయానికి స్థానికులు మాచర్ల సందీప్-చందన, నారగోని రవిచంద్ర-గాయత్రి దంపతులు ఎల్లమ్మ విగ్రహాన్ని బహూకరించారని ఆయన వివరించారు. గ్రామంలోని గౌడ కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ పరమేశ్వర్, గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీను, ఉపాధ్యక్షుడు గనగోని వెంకటేశ్వర్లు, గౌడ సంఘం మండల అధ్యక్షుడు గనగోని రమేశ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు నారగోని రాజుగౌడ్, నాయకులు పంతం రాజు, రాములు, లింగయ్య, శ్రీనివాస్, వెంకన్న, స్వామి, సంపత్ పాల్గొన్నారు.